క్లుప్తంగా

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆటోలో అసెంబ్లీకి వెళ్తున్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: ఆటో డ్రైవర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు శుక్రవారం నిర్వహించిన ఆటో యూనియన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో యూనియన్‌కు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. అలాగే రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కోసం బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: టీయూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రభువు చందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్, గౌరవ అధ్యక్షుడిగా రమణారెడ్డి, కోశాధికారిగా ప్రహ్లాద్, శేఖర్, మహిళ అధ్యక్షురాలుగా శృతి, కార్యదర్శులుగా వినిత రెడ్డి, రమేశ్, బేగంలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా, జిల్లా కార్యదర్శులు లచ్చిరెడ్డి, చంద్రకిరణ్ రెడ్డిలు వ్యవహరించారు.

రేపు యూటీఎఫ్ జిల్లా సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: టీఎస్ యూటీఎఫ్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఈనెల 11న నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించనున్న సమావేశానికి ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మాంగుర్ల పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



చెఫ్‌ల వేషధారణలో విద్యార్థులు

జైనథ్: మండలంలోని మాంగుర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా వివిధ రకాల వంటకాలు సిద్ధం చేసి, ప్రదర్శించారు. వంటకాలు, వాటిలో ఉండే పోషక విలువల గురించి విద్యార్థులు వివరించారు. మేడిగూడ క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు చంద్రకళ, అరుణ్, వినోద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు సంతోష్, ప్రతాప్, రషీద్, స్వామి పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంఎస్‌సీ మాజీ చైర్మన్ ముదిగొండ గంగాధర్‌ను శుక్రవారం ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. గత నాలుగు సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్: దేవుల్ నాయక్‌తండా గ్రామపంచాయతీలో ప్రత్యేకాధికారిగా నియమితులైన బోథ్ ఎంపీడీవో సుశీల్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వచ్చిన సందర్భంగా చింతల్‌బోరి ఎంపీటీసీ సునీత రోహిదాస్ శాలువాతో సన్మానించారు. గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నర్ర నవీన్ యాదవ్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత పదవుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, శ్రీనివాస్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: ట్రైబల్ వెల్ఫేర్ గజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ డైరీని రాష్ట్ర, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా శుక్రవారం ములుగు జిల్లాలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు చదువులు మధ్యలో మానేయకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి చందన్, చీఫ్ అడ్వైజర్ సుధాకర్, ఉపాధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రేమ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

తాంసి: మండలంలోని గిరిగాం గ్రామ మాజీ సర్పంచ్ గంగారాం (65) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

దాహం తీర్చని 'భగీరథ'

- గ్రామాల్లో మొదలైన నీటి కష్టాలు
- ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్న గిరిజనులు



రాంపూర్‌గూడలో అలంకారప్రాయంగా వాటర్ ట్యాంకు



నిజాంగూడలో వాటర్ ట్యాంకు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

సిరికొండ: రానున్న వేసవిలో ఏ గ్రామంలో నీటి కష్టాలు రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అధికార యాత్రంగాన్ని ఆదేశించింది. గత ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఏ ఒక్క గ్రామంలో పూర్తిస్థాయిలో భగీరథ నీరు రావడం లేదు. కొన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు ఇంటింటికీ నల్లా చేరలేదు. వేసవి రాకముందే మండలంలోని అనేక గిరిజన గ్రామాలు నీటి ఎద్దడి నెలకొంది.

ట్యాంకు వరకు వచ్చి..

మండలంలోని అనేక గిరిజన గ్రామాల్లో భగీరథ నీరు వాటర్ ట్యాంకు వరకు వచ్చి ఇంటింటికీ ఉన్న నల్లా వరకు రావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. మండలంలోని నిజాంగూడ గ్రామంలో ఉన్న 60 కుటుంబాలకు ఉన్న వాటర్ ట్యాంకు కుమురం భీం జిల్లా నుంచి వస్తున్న నీటితోనే నిండుతోంది. కానీ ఇక్కడి నుంచి గ్రామంలోకి మాత్రం నీరు రావడం లేదు. దీనికి కారణం పైపులైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడమే. తాగునీరు కావాలంటే బిందెలు పట్టుకొని ట్యాంకు వద్దకే రావాలి. లేదా వ్యవసాయ బావి వద్దకు నడుచుకుంటూ.. వెళ్లి నీరు తెచ్చుకోవాలి. ఒక్క నిజాంగూడనే కాదు పక్కనే ఉన్న రాంపూర్ గూడ గ్రామస్తులది కూడా అదే తీరు.

మరమ్మతులు చేపడితే..

మండలానికి భగీరథ నీరు రెండు నియోజకవర్గాల నుంచి సరఫరా అవుతోంది. బోథ్ నియోజకవర్గానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా అవుతోంది. కానీ ఖానాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలకు మాత్రం నీటి ట్యాంకు వరకు వచ్చి ఇంటింటికి మాత్రం రావవడం లేదు. పైపులైన్ లీకేజీలు, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇప్పటికీ కొన్ని చోట్ల బిగించలేదు. దీంతో గిరిజన గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. కిలో మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల వద్దకు ఎడ్లబండిపై వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటింటికీ భగీరథ నీరు చేరే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకు వద్దకే పోవాలి



ఇప్పటి వరకు ఇంటింటికీ నల్లా నీరు రావడం లేదు. ఇంతకు ముందు నీటి కోసం గ్రామ శివారులోని వ్యవసాయ బావికి వెళ్లి తీసుకు వచ్చే వాళ్లం. ఇప్పుడు ట్యాంకుకు కొన్ని రోజుల నుంచి నీళ్లు వస్తున్నాయి.

– మెస్రం జైశీల, నిజాంగూడ

చుక్క నీరు రాలేదు



మా ఇంటి వద్ద పెట్టిన నల్లాకు ఇప్పటి వరకు చుక్క నీరు రాలేదు. వట్టిగానే బిగించి పోయింద్రు. నీళ్ల కోసం చేనులో ఉన్న బావి వద్దకు పోయి తీసుకువస్తున్నాం. నీటి కోసం చాలా కష్టాలు పడాల్సి వస్తోంది.

– మెస్రం యోగేశ్వరీ, నిజాంగూడ

మరమ్మతులు చేపడుతాం



మండలంలో ఉన్న నీటి ఎద్దడి ఉంది. కొన్ని గ్రామాల్లో పైపు లీకేజీలు, ట్యాంకు నుంచి ప్రతి ఇంటికీ వెళ్లే పైపులకు కనెక్షన్ ఇవ్వలేదు. ప్రస్తుతానికి ట్యాంకులకు నీటి సరఫరా అవుతోంది. మరమ్మతులుఉ చేస్తే ఇంటింటికీ నీరు చేరుతోంది.

– జైపాల్, మిషన్ భగీరథ, ఏఈ

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సంచులు అందజేస్తున్న తహసీల్దార్ లక్ష్మి

తాంసి: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ లక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని పొన్నారి గ్రామంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సంచులను వాడాలని ప్రజలకు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రఘు, పంచాయతీ కార్యదర్శి విజయ్, మాజీ సర్పంచ్ అశోక్, పాఠశాల హెచ్‌ఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

భవన ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ హోమ్ మొదటి అంతస్తులో ఈనెల 11న బీసీ సంక్షేమ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ సోయం బాపురావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, కోశాధికారి అంజయ్‌కుమార్, సంఘం నాయకులు దయాకర్‌రావు, రాసం రాజు, పిడుగు స్వామి, దొండ రాజు, బోర్పత్ శ్రీనివాస్, ఎక్కాల శ్రీనివాస్‌గౌడ్, రవీందర్, అశోక్, శ్రీనివాస్, ముకుంద్, సంతోశ్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఆశలత

ఎదులాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ వసతి గృహంలో ఇటీవల చోటు చేసుకున్న ఇద్దరు బాలికలకు సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆశలత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్‌లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు లంక జమున, మంజుల, లలిత, ఇందూబాయి, పంచపూల పాల్గొన్నారు.

నాడు తల్లి.. నేడు తండ్రి మృతి

- అనాథలైన చిన్నారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తుల విన్నపం



పెందూర్ పక్రు (ఫైల్)



అనాథలైన గిరిజన చిన్నారులు

నార్నూర్: ఏజెన్సీలోని మారుమూల గ్రామమైన దాబా(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని పున్నాగుడకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం ఆసుపత్రికి తరలించాలంటే తిప్పలు తప్పవు. అదే గ్రామానికి చెందిన పెందూర్ పక్రు (37) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మత్యుడి భార్య పెందూర్ రుక్మబాయి 2019లో గర్భిణిగా ఉన్నప్పుడు సరైన వైద్యం అందక మృతి చెందింది. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు. ఒక కూతురు వికలాంగురాలు. అప్పుడు తల్లి ఇప్పుడు తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. నా అనే వారు ఎవరూ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. జ్యోతి ఆరో తరగతి, జల్లుబాయి నాలుగో తరగతి, అనిత రెండ తరగతి, దత్తు ఒకటో తరగతి చదువుతున్నారు. ఎవరైనా దాతలు, లేదా ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామపటేల్ పెందూర్ రమేశ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ కోరుతున్నారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి

నార్నూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు ఈనెల 15లోపు ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు విద్యుత్ శాఖ కార్యాలయం నార్నూర్ వద్ద రెండు కౌంటర్లను శనివారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు రశీదు, ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న రసీదు జతపరిచి అందజేయాలని కోరారు.

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో ఆసక్తి

ఆదిలాబాద్‌రూరల్: సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని అగ్రికల్చర్ కాలేజ్ అసోసియేట్ డీన్ శ్రీధర్ చౌహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాక్రెడ్ హార్ట్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు, పురాతన వస్తువుల ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, పాఠశాల సిబ్బంది విఠల్, వెంకట స్వామి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనం నడిపే ప్రతిఒక్కరూ రోడ్డుపై సిగ్నల్ రూల్స్ పాటించాలని, సీటుబెల్టు, బైక్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భీంరావ్, ప్రధానోపాధ్యాయులు నరేశ్, ప్రసాద్, దేవిదాస్ పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'



పరామర్శిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: అధైర్య పడొద్దని, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను శుక్రవారం పరామర్శించారు. టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు వాగ్మరే ప్రశాంత్ ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద ఉండడంతో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే జాగృతి ప్రధాన కార్యదర్శి గోలి శంకర్‌ను అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం పొందగా.. ఆయనను సైతం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బండారి సతీష్, రంగినేని శ్రీనివాస్, రమేశ్, రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలపై సీఎం సానుకూల స్పందన



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: జిల్లాలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సర్వే నం. 38 నిశాన్ ఘాట్‌లో 8 ఎకరాల్లో నివాసముంటున్న ప్రజలకు కనీస వసతులు రోడ్డు, డ్రెయినేజీ, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని, సర్వే నం. 170లో రెండు ఎకరాల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలు అందించాలని సీఎంను కోరారు. త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు బత్తిని గణపతి, పెద్ది నర్సింహులు, బెజ్జంకి నర్సింగరావు, అశోక్, స్వామి పాల్గొన్నారు.

ముగిసిన ఖండేవ్ జాతర

- హుండీ లెక్కించిన ఆలయ కమిటీ సభ్యులు



హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నార్నూర్: గతనెల 25 నుంచి ప్రారంభమైన ఖండేవ్ జాతర శుక్రవారంతో ముగిసింది. ఆలయ ఆవరణంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని తొడసం వంశస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ మాట్లాడుతూ.. ఖండేవ్ జాతర తైబజార్ ఆదాయం రూ.1,29,500, ఆలయ హుండీ ఆదాయం రూ. 74222, మొత్తం రూ, 203722 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, తాజా మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ఆలయ పూజారిలు తొడసం బాపూరావు, తెలంగారావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పుస్తక పరిజ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ కార్యదర్శి, కెమిస్ట్రీ ఎంఎస్సీ పీహెచ్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్, కాటన్ సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధి, నైపుణ్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో గౌరవ ప్రదమైన ఉద్యోగం సాధించాలంటే తమలోని నైపుణ్యాలను గుర్తించాలన్నారు. ఉద్యోగం కోసం కావాల్సిన నైపుణ్యాల గురించి విద్యార్థులు, యువత తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు రమాకాంత్, నరేందర్, దేవన్న, నూరాని, ప్రకాష్, ఆనంత్, వెంకట రమణ, పిల్లి కిషన్ పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులే..!



అనుమతులు లేక నిలిచిపోయిన బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ రోడ్డు పనులు

- నిధులు మంజూరైనా ముందుకు సాగని రోడ్డు పనులు
- అటవీశాఖ అనుమతుల పేరిట కాలయాపన

ఇచ్చోడ: జిల్లాలో మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్ల నిర్మాణల కోసం అక్కడి ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. నిధులు మంజూరైనా అటవీశాఖ నుంచి అనుమతులు లేక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో మంజూరైన నిధులు మూలుగుతున్నాయి. దీంతో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలగానే మిగిలింది. అత్యవసర సమయంలో కిలోమీటర్ల దూరం నడిచి మండల కేంద్రాలకు చేరుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అనుమతులు తీసుకురావడంలో జిల్లా ప్రజాప్రతినిధులు చొరవచూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటుందని, బంతిని అటవీశాఖ వైపు నెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో జిల్లాలో ఏళ్ల తరబడి రోడ్ల నిర్మాణం జరగకుండా మధ్యలోనే పనులు నిలిచిపోతున్నాయి. బజార్‌హత్నూర్ మండల కేంద్రం నుంచి బరంపూర్ మీదుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రం వరకు 16 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 2007లో అప్పటి ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. బరంపూర్ నుంచి నందిగామ వరకు సంబంధిత కాంట్రాక్టర్ ఏడేళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. కాని నందిగామ నుంచి మొర్థండి వరకు దాదాపుగా 6 కిలో మీటర్లు అటవీ ప్రాంతం కావడంతో అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆదిలాబాద్ నుంచి బజార్‌హత్నూర్‌కు కేవలం 20 కిలో మీటర్ల దూరం ప్రయాణించి చేరుకోవచ్చు. ఆదిలాబాద్, తలమడుగు, తాంసి మండలాల ప్రజలు ఈ రోడ్డు గుండా పవిత్ర పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లా అడెల్లికి బోథ్ ధన్నూర్‌ల మీదుగా కేవలం 35 కిలోమీటర్లతో చేరుకోవచ్చు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు రాకపోకలకు దూరభారం తగ్గుతుంది.

మూడు జిల్లాలకు అనుసంధానం..

ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాల మధ్యన ఫకిర్‌పెట్, పులగం పాండ్రి మధ్యలో రెండు కిలోమీటర్లు అటవీప్రాంతం ఉండడంతో రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి ఫకీర్‌పెట్ వరకు, నిర్మల్ జిల్లా పుల్‌గాం పాండ్రి వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. కానీ మధ్యలో రెండు కిలో మీటర్ల పొడవు అటవీ ప్రాంతం ఉండడంతో రోడ్డు నిర్మాణానికి బ్రేక్ పడింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తతే ఇచ్చోడ నుంచి సిరిచెల్మ మీదుగా పెంబి, ఖానాపూర్, మెటిపల్లి, జగిత్యాల, కరీంనగర్, ప్రాంతాలకు 70 కిలో మీటర్లు దూరం భారం తగ్గుతుంది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు అనుసంధానం అవుతుంది.

పెండింగ్‌లో ఉన్నాయి



జిల్లాలో పలు రోడ్ల నిర్మాణలకు అనుమతులు కోసం పంపిన ఫైళ్లు కేంద్ర ప్రభుత్వం వద్ద పెడింగ్‌లో ఉన్నాయి. రోడ్ల అనుమతులకు రాష్ట్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చి కేంద్రానికి పంపింది. కేంద్రం నుంచి అనుమతులు రాగానే రోడ్డు పనులకు అనుమతులు ఇస్తాం.

– బర్నోబా, ఎఫ్‌డీవో, ఇచ్చోడ